సాక్షి
కరీంనగర్

I

సోమవారం ၊ 23 ၊ అక్టోబర్ ၊ 2023

విజయీభవ..

చిన్నాపెద్దా తారతమ్యం లేకుండా ఆనందంగా జరుపుకొనే పండుగ దసరా. జగత్తుకు మూలం.. త్రిమూర్తులకు శక్తిప్రదాత.. త్రిలోకేశ్వరి సకలాభీష్ట ప్రదాయిని దుర్గామాత దుష్ట శిక్షణ చేసిన రోజు విజయదశమి. చేసే ప్రతిపనిలోనూ విజయం సాధించాలని కోరుకుంటూ శమీవృక్షాన్ని పూజించడం సంప్రదాయం. ఇలాంటి దసరా రోజు యంత్ర, వాహన, పనిముట్లకు పూజలు చేయడం ఆనవాయితీ. నేడు విజయదశమి..







నగరంలోని గోకుల్ చౌరస్తాలో బతుకమ్మ ఆడుతున్న మహిళలు





మంకమ్మతోటలో..

సంబరంగా.. సద్దులు

- వైభవంగా పెద్దబతుకమ్మ • దాండియా ఆటలు.. డీజే పాటలతో • ఆడిపాడిన ఆడపడుచులు

కరీంనగర్ కల్చరల్: తీరొక్క పూలతో అవని విరిసింది.. ఉయ్యాల పాటలతో ఇంతి మురిసింది.. ఊరూవాడా పూలజాతరతో పులకించగా.. సద్దుల బతుకమ్మ సంబరం అంబరాన్నంటింది. జిల్లావ్యాప్తంగా ఆదివారం సద్దుల బతుకమ్మ వేడుకలు వైభవంగా జరిగాయి. పల్లె, పట్టణాల్లో ఆడపడుచులు ప్రధాన కూడళ్లు, ఆలయాల్లో బతుకమ్మలు పెట్టి ఆడిపాడారు. ఉయ్యాలపాటలు, దాండియా ఆటలు.. డీజే మోతలతో ఆయా ప్రాంతాలు మార్మోగాయి. కరీంనగర్‌లోని గంజ్, రాంనగర్, కమాన్, మంకమ్మతోట ప్రాంతాల్లో పెద్ద ఎత్తున మహిళలు బతుకమ్మ వేడుకల్లో ఆడిపాడారు. పొద్దుపోయే వరకు బతుకమ్మ ఆడిన ఆడపడుచులు సమీప చెరువుల్లో నిమజ్జనం చేశారు. వెళ్లిరా బతుకమ్మ.. మళ్లీరావమ్మా.. అంటూ ఘనంగా వీడ్కోలు పలికారు. వాయినాలు ఇచ్చిపుచ్చుకుని.. గౌరమ్మకు పూజలు చేశారు. మంత్రి గంగుల కమలాకర్, మేయర్ వై.సునీల్‌రావు పలుచోట్ల సంబరాలలో పాల్గొన్నారు.



హుజూరాబాద్‌లో బతుకమ్మ సంబరాలు



మానకొండూర్‌లో..





బతుకమ్మతో యువతులు



బతుకమ్మతో యువతి



బతుకమ్మతో ఎంపీ సంజయ్ దంపతులు



బతుకమ్మ ఎత్తుకున్న మంత్రి కమలాకర్, డిప్యూటీ మేయర్ చల్లా స్వరూపరాణి, తదితరులు





మహాశక్తి ఆలయంలో బతుకమ్మ ఆడుతున్న మహిళలు



బతుకమ్మను నిమజ్జనానికి తీసుకెళ్తున్న మహిళలు



మానకొండూర్ చెరువులో బతుకమ్మ నిమజ్జనం



నృత్యం చేస్తున్న యువతి

న్యూస్‌రీల్

రాజన్న సేవలో కరీంనగర్ ఫస్ట్ అడిషనల్ సెషన్స్ జడ్జి



వేములవాడ: వేములవాడ రాజన్నను ఆదివారం కరీంనగర్ ఫస్ట్ అడిషనల్ సెషన్స్ జడ్జి శ్రీవాణి కుటుంబ సమేతంగా దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. కోడె మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం నాగిరెడ్డి మండపంలో అర్చకులు వేదోక్త ఆశీర్వచనంతో పాటు ప్రసాదం అందజేశారు. కార్యక్రమంలో ప్రోటోకాల్ పర్యవేక్షకుడు సిరిగిరి శ్రీరాములు, ఆలయ ఇన్‌స్పెక్టర్ సంకపల్లి పవన్ ఉన్నారు.

మంత్రి కమలాకర్ విజయదశమి శుభాకాంక్షలు



కరీంనగర్‌కల్చరల్: చెడుపై విజయానికి సంకేతంగా... మంచి గెలుపుకు సూచికగా నిర్వహించుకునే పర్వదినం విజయదశమి అని బీసీ సంక్షేమశాఖ మంత్రి గంగుల కమలాకర్ అన్నారు. సీఎం కేసీఆర్ సారథ్యంలో దేశంలోనే అన్నిరంగాల్లో నంబర్‌వన్‌గా నిలుస్తూ అప్రతిహత విజయాలు నమోదు చేస్తున్న తెలంగాణ, రాబోయే కాలంలోనూ కేసీఆర్ నాయకత్వంలో మరింత అద్భుతమైన ప్రగతి సాధించాలని విజయ దుర్గాదేవిని ప్రార్థిస్తూ జిల్లా ప్రజలందరికీ దసరా శుభాకాంక్షలు తెలిపారు.

బరిలో బండి.. ఈటల.. అర్వింద్

- ఉమ్మడి జిల్లా నుంచే సీఎం అభ్యర్థులు..!
- బీసీ సీఎం నినాదంతో అనుచరుల్లో ఉత్సాహం
- తొమ్మిది స్థానాల్లో అభ్యర్థులను ప్రకటించిన కమలం
- హుజూరాబాద్, గజ్వేల్‌లో రెండుచోట్ల బరిలో రాజేందర్
- 19 ఏళ్ల తరువాత రెండు స్థానాలకు కరీంనగర్ నేత పోటీ



పోటీకి బండి, ఎస్.కుమార్ అనాసక్తి..

కేంద్రమంత్రివర్గ విస్తరణలో మంత్రి పదవి వస్తుందని ప్రచారం జరుగుతున్న క్రమంలో అసెంబ్లీకి పోటీ చేయాలని ఆదేశాలు రావడంపై బండి సంజయ్.. అసలు తనకు మాట మాత్రమైనా చెప్పకుండా ధర్మపురిలో పోటీ చేయాలని చెప్పడంపై ఎస్.కుమార్ అసంతృప్తితో ఉన్నారని సమాచారం.

సాక్షి ప్రతినిధి, కరీంనగర్: అసెంబ్లీ బరిలో నిలిచే బీజేపీ అభ్యర్థుల తొలి జాబితా విడుదలైంది. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో 13 స్థానాలు ఉండగా.. తొమ్మిది స్థానాలకు ఆ పార్టీ అభ్యర్థులను ప్రకటించింది. తొలిజాబితా అభ్యర్థులకు శనివారం రాత్రే పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి ఫోన్ చేసి పోటీకి ఏర్పాట్లు చేసుకోవాలని సూచించినా అధికారికంగా ప్రకటించేవరకూ ఈ విషయాన్ని ఎవరూ వెల్లడించలేదు. 2018 ఎన్నికలతో పోల్చితే నాయకుల విషయంలో స్పష్టమైన తేడా కనిపిస్తోంది. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో పలు స్థానాల్లో ప్రాతినిధ్యం కరవవడం.. లేదా పొత్తులతో సాగే చరిత్ర ఉన్న బీజేపీ తాజాగా బలోపేతమైంది. ప్రస్తుతం ఇద్దరు సిట్టింగ్ ఎంపీలు, ఓ సిట్టింగ్ ఎమ్మెల్యే, అలాగే మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్, జెడ్పీటీసీ, మాజీ ఎమ్మెల్యే బరిలో ఉండటం గమనార్హం.

పార్టీ ప్రకటించింది వీరినే..

- కోరుట్లకు ధర్మపురి అరవింద్, జగిత్యాలకు భోగ శ్రావణి, ధర్మపురికి ఎస్.కుమార్, చొప్పదండికి బొడిగె శోభ, రామగుండంకు కందుల సంధ్యారాణి, సిరిసిల్లకు రాణీ రుద్రమదేవి, కరీంనగర్‌కు బండి సంజయ్, మానకొండూరుకు ఆరెపల్లి మోహన్, హుజూరాబాద్‌కు ఈటల రాజేందర్ పేర్లను పార్టీ ప్రకటించింది.

ఈటల తన సొంత నియోజకవర్గమైన హుజూరాబాద్‌తోపాటు ప్రస్తుతం సీఎం ప్రాతినిధ్యం వహిస్తున్న గజ్వేల్ నుంచి కూడా బరిలోకి దిగనుండటం విశేషం. జిల్లా చరిత్రలో కేసీఆర్ తరువాత రెండుసార్లు బరిలోకి దిగుతున్న ఏకైక నాయకుడు ఈటల కావడం గమనార్హం. 2004లో కరీంనగర్ ఎంపీ, సిద్దిపేట అసెంబ్లీకి పోటీ చేసిన కేసీఆర్.. రెండుచోట్లా విజయం సాధించారు. తరువాత సిద్దిపేట స్థానానికి రాజీనామా చేశారు. దాదాపు 19 ఏళ్ల తరువాత కరీంనగర్ నుంచి రెండుచోట్ల అసెంబ్లీ స్థానాలకు పోటీ చేస్తుండటం విశేషం.

ముగ్గురు సీఎం అభ్యర్థులు

- బీసీ సీఎం నినాదంతో బీజేపీ ఈసారి ఎన్నికల బరిలోకి దిగే యోచనలో ఉంది. పార్టీలో బీసీ సీఎం అభ్యర్థి ప్రతిపాదన రాగానే.. ఎంపీ బండి సంజయ్, ఎమ్మెల్యే ఈటల మధ్య పోటీ మొదలైంది. మరోవైపు తాను ఏమాత్రం తక్కువా..? అన్నట్లు కోరుట్ల అసెంబ్లీ నుంచి నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అరవింద్ రంగంలోకి దిగారు.
- బండి సంజయ్ 2014, 2018 అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేసి గంగుల కమలాకర్ చేతిలో పరాజయం పాలయ్యారు. 2019 పార్లమెంట్ ఎన్నికల్లో అనూహ్యంగా విజయం సాధించారు. ఆ తరువాత రాష్ట్ర అధ్యక్ష పదవి చేపట్టి బీజేపీకి ఊపు తెచ్చారు. దుబ్బాక, జీహెచ్‌ఎంసీ, హుజూరాబాద్ ఎన్నికల్లో బీజేపీని విజయతీరాలకు చేర్చారు. 8శాతం ఉన్న ఓటుబ్యాంకును అమాంతం పెంచారు. పార్టీ తరఫున బీసీ సీఎంగా తమ నాయకుడే ఉండాలని రాష్ట్రవ్యాప్తంగా సంజయ్ అనుచరులు కోరుకుంటున్నారు.
- తెలంగాణ ఉద్యమ పార్టీ బీఆర్‌ఎస్ వేదికగా రాజకీయ ఆరంగేట్రం చేసిన ఈటల రాజేందర్ 2004, 2008, 2009, 2010, 2014, 2018, 2021లో వరుసగా ఏడుసార్లు ఎమ్మెల్యేగా గెలిచారు. మంత్రిగా, శాసనసభాపక్ష నేతగా పనిచేసిన అనుభవంతో రాజేందర్ సైతం పార్టీ సీఎం అభ్యర్థి అవుతారని ఆయన అనుచరులు చెప్పుకుంటున్నారు.
- ఎలాగైనా అసెంబ్లీ బరిలో ఉండాలన్న పట్టుదలతో కొంతకాలంగా ధర్మపురి అర్వింద్ కోరుట్లలో చాపకింద నీరులా పనిచేసుకుంటూ వెళ్తున్నారు. ఇక్కడ సిట్టింగ్ ఎమ్మెల్యే కె.విద్యాసాగర్‌రావు కుమారుడు సంజయ్ బీఆర్‌ఎస్ అభ్యర్థిగా ఉన్నారు. సంజయ్ కొత్త అభ్యర్థి కావడం, తాను ఎంపీగా ఉన్న నిజామాబాద్ పార్లమెంట్ పరిధిలోనే కోరుట్ల ఉండటం, తన అమ్మమ్మ ఊరు కావడం, సొంత సామాజికవర్గం సహకారం తదితరాల లెక్కలతో అర్వింద్ ఈసారి కోరుట్లపై కన్నేశారు.

బండి సంజయ్



జన్మదినం: 11-07-1971
విద్యార్హతలు: గ్రాడ్యుయేషన్
స్వగ్రామం: కరీంనగర్
అనుభవం: 2005, 2014లో కార్పొరేటర్, 2014, 2018 ఎమ్మెల్యే స్థానానికి పోటీ, 2019 ఎంపీగా విజయం.
- అదనపు సమాచారం: బీజేపీ రాష్ట్ర అధ్యక్ష పదవి, ప్రస్తుతం జాతీయ ప్రధాన కార్యదర్శి

సామాజిక వర్గం: మున్నూరుకాపు

ఈటల రాజేందర్



జన్మదినం: 20-03-1964
విద్యార్హతలు: పీజీ (ఉస్మానియా)
స్వగ్రామం: కమలాపూర్ (ప్రస్తుతం హన్మకొండ జిల్లా)
అనుభవం: ఏడుసార్లు ఎమ్మెల్యే, రెండుసార్లు మంత్రి, శాసనసభ పక్షనేత
- అదనపు సమాచారం: 2021లో బీజేపీలో చేరిక. చేరికల కమిటీ చైర్మన్, ఎన్నికల నిర్వహణ కమిటీ చైర్మన్.

సామాజిక వర్గం: ముదిరాజ్

ధర్మపురి అర్వింద్



జన్మదినం: 25-08-1976
విద్యార్హతలు: ఎంఏ.పొలిటికల్ సైన్స్
స్వగ్రామం: నిజామాబాద్
అనుభవం: 2019 నిజామాబాద్ ఎం పీ,
- అదనపు సమాచారం: కేంద్ర వాణిజ్య స్టాండింగ్ కమిటీ సభ్యులు

సామాజికవర్గం: మున్నూరుకాపు

బొడిగె శోభ



జన్మదినం: 1972
విద్యార్హతలు: పదవ తరగతి
స్వగ్రామం: వెంకటేశ్వర్లపల్లె, సైదాపూర్ మండలం
అనుభవం: 2001 శంకరపట్నం జెడ్పీటీసీ, 2014లో ఎమ్మెల్యే (బీఆర్‌ఎస్), 2018 ఎమ్మెల్యేగా ఓటమి.
- అదనపు సమాచారం: చొప్పదండి బీజేపీ ఇన్‌చార్జి

సామాజికవర్గం: ఎస్సీ (మాదిగ)

ఎస్.కుమార్



జన్మదినం: 10-10-1966
విద్యార్హతలు: ఎంసీజే, ఎల్‌ఎల్‌ఎం (ఉస్మానియా)
స్వగ్రామం: గోదావరిఖని
అనుభవం: రామగుండం మున్సిపాలిటీ చైర్మన్ 2004, 2009 ధర్మపురి ఎమ్మెల్యే స్థానానికి, 2019 పెద్దపల్లి ఎంపీ స్థానానికి పోటీ చేసిన అనుభవం
- అదనపు సమాచారం: జర్నలిస్టుగా అనేక అవార్డులు, బీజేపీ జాతీయస్థాయిలో పలు పదవుల నిర్వహణ.

సామాజికవర్గం: ఎస్సీ (మాల)

ఆరెపల్లి మోహన్



జన్మదినం: 6-6-1955
విద్యార్హతలు:ఎంకామ్.,ఎల్‌ఎల్‌బీ
స్వగ్రామం: మానకొండూరు
అనుభవం: సర్పంచి, జెడ్పీ చైర్మన్, ఎ మ్మెల్యే, విప్. 2009లో మానకొండూరు ఎమ్మెల్యే, 2014, 2018లో అక్కడ నుంచే పరాజయం.
- అదనపు సమాచారం: 2019లో బీఆర్‌ఎస్‌లో చేరిక, టికెట్ ఆశించి భంగపడి కమలం గూటికి.

సామాజికవర్గం: ఎస్సీ (మాదిగ)

ఇసుక తవ్వకాలపై ఆందోళన

వీణవంక: మండలంలోని కొండపాక మానేరువాగులో అర్ధరాత్రి అక్రమంగా ఇసుక తవ్వకాలు చేపడుతున్నారని గ్రామస్తులు ఆందోళన చేపట్టారు. వాగులో ఇసుక తవ్వకాలు చేపడుతుండగా గ్రామస్తులు వాహహాలను అడ్డుకున్నారు. తహసీల్దార్‌ తిరుమల్‌రావు ఘటనా స్థలానికి చేరుకొని గ్రామస్తులతో మాట్లాడారు. కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్‌ చేశారు. మైనింగ్‌ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని ఆరోపించారు. రైతుల ఫిర్యాదు మేరకు ఎస్సై ఆసిఫ్‌కు తహసీల్దార్‌ ఫిర్యాదు చేశారు. వాహనాలు అదుపులోకి తీసుకోవాలని హుజూరాబాద్‌ ఆర్డీవో పోలీసులకు చెప్పినట్లు తెలిసింది. బాధ్యులపై వెంటనే చర్యలు తీసుకోవాలని బీఆర్‌ఎస్‌ రాష్ట్ర నాయకుడు తుమ్మేటి సమ్మిరెడ్డి డిమాండ్‌ చేశారు. డంప్‌చేసిన ఇసుకను మాత్రమే తరలించాల్సి ఉండగా అర్ధరాత్రి అక్రమంగా వాగులో ఇసుక తవ్వకాలు చేపడుతున్నారన్నారు. దీనిపై సీఎం కేసీఆర్‌ దృష్టికి తీసుకెళ్లనున్నట్లు సమ్మిరెడ్డి తెలిపారు.

విజయానికి ప్రతీక

• శక్తి ఆరాధనకు ప్రాధాన్యం • శమీ పూజల ప్రత్యేకం • నేడు దసరా

కరీంనగర్‌కల్చరల్‌/విద్యానగర్‌ : ఆశ్వయుజ శుద్ధ పాడ్యమి నుంచి ఆశ్వయుజ శుద్ధనవమి వరకు తొమ్మిదిరోజులు దేవీ నవరాత్రులు జరుపుకుని పదోరోజు విజయదశమిని ఘనంగా నిర్వహించుకుంటారు. శక్తి ఆరాధనకు ప్రాధాన్యం ఇచ్చే పండుగ ఇది. చెడుపై మంచి విజయానికి సూచికగా నిర్వహించుకునే వేడుకే విజయదశమి. దసరా రోజున చేపట్టిన ప్రతీపనిలో విజయం లభిస్తుందని నమ్మకం. అందుకే శక్తి స్వరూపం ఆశీస్సులతో ప్రతిపని చేస్తుంటారు. దసరా అంటే పది దుర్గుణాలపై విజయం సాధించే శక్తినిచ్చేది. రాముడు రావణుడిపై గెలిచిన రోజుగానే గాకుండా పాండవులు వనవాసం వీడుతూ.. జమ్మిచెట్టుపై ఉన్న తమ అయుధాలు తిరిగితీసిన రోజు అని కూడా చరిత్ర చెబుతోంది. అందుకే దసరా రోజు రావణవధ, జమ్మి ఆకు పూజ చేస్తుంటారు. దుర్గాదేవి మహిషాసురడనే రాక్షసునితో నవరాత్రులు యుద్ధం చేసి విజయం సాధించిన రోజును విజయదశమిగా కూడా చెబుతుంటారు.



శమీ పూజ విశేషం

దసరా రోజున శమీ పూజ ప్రత్యేకం. శమీ వృక్షం సువర్ణ వర్షం కురిపిస్తుందని శాస్త్రాలు చెబుతున్నాయి. విజయదశమి రోజున పూజలు చేసిన జమ్మిచెట్టు ఆకులను ఇంట్లోని పూజాస్థలంలో, నగదుపెట్టిలో ఉంచుతారు. దీంతో ధనవృద్ధి జరుగుతుందని ప్రతీతి. శ్రీరాముడి వనవాస సమయంలో కుటీరం జమ్మిచెట్టు చెక్కలతో నిర్మించారని చెబుతారు. శమీ అంటే పాపాల్ని, శత్రువులను నశింపచేసేదిగా, అందుకే జమ్మి చెట్టుకు అంత ప్రాముఖ్యం.

ఆయుధ పూజ

మహిషాసురుడిని వధించడానికి దుర్గదేవి అష్టభుజాలతో అవతరించింది. దేవతలు తమ ఆయుధాలను అందించడంతో ఆదిశక్తి మహావిరాట్‌ రూపాన్ని సంతరించుకుంది. హిమవంతుడు ఇచ్చిన సింహాన్ని అధిరోహించి మహిషాసురుడిని వధించి వి జయవిలాసిగా మూర్తిమత్వాన్ని చాటుకుంది. అందువల్లే పూర్వం రాజులు ఆయుధాలను పూజించేవారు. ఆ ఆచారంతోనే దసరా రోజు యంత్రం, వా హన, పనిముట్లకు పూజలు చేయడం ఆనవాయితీ.

బంగారం ఇచ్చి ఆశీర్వాదం

పెద్ద, చిన్న తేడా లేకుండా అందరూ కలిసి జమ్మిచెట్టు ఆకులను కుంకుమ కలిపిన బియ్యంలో కలుపుతారు. పూజ చేసిన జమ్మి, ఆకులు, బియ్యాన్ని ప్రతి ఒక్కరు తీసుకవెళ్తారు. దీనిని బంగారం అని పిలుస్తారు. ఈ బంగారం తీసుకెళ్లి తల్లిదండ్రులకు, పెద్దలకు చేతిలో పెట్టి ఆశీర్వాదం పొందడం ఆనవాయితీ. ఒకరికి ఒకరు ఇచ్చుకుని అలయ్‌బలయ్‌ చేసుకుంటారు.

పాల పిట్టల దర్శనం

దసరా రోజు సాయంత్రం పాలపిట్టను చూస్తే శుభం కలుగుతుందనే నమ్మకం. ఈ రోజున మూడు రకాల పక్షులను చూడడం ఆనవాయితీ. పాలపిట్టను చూస్తే పాపాలు, కర్రెపిట్టను చూసే కష్టాలు, గరత్మంతుడు అంటే గద్దను చూసే గండాలు తొలుగుతాయని ప్రజల నమ్మకం.

బీసీలకు అధిక సీట్లు కేటాయించాలి



మాట్లాడుతున్న జాజుల శ్రీనివాస్‌గౌడ్‌

కరీంనగర్‌: వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో ప్రతి రాజకీయ పార్టీ జనాభా దమాషా ప్రకారం బీసీలకు అధిక సీట్లు కేటాయించాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్‌ డిమాండ్‌ చేశారు. ఆదివారం ఓ హోటల్‌లో ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు ఎన్నం ప్రకాశ్‌ అధ్యక్షతన జరిగిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో అన్ని పార్టీలు జనాభా ప్రాతిపదికన 60సీట్లు, ముఖ్యమంత్రి పదవి కేటాయించిన పార్టీకే బీసీ సంఘం మద్దతు ఉంటుందని తెలిపారు. దేశంలో బీసీ జనగణన చేపట్టాలని, మహిళా బిల్లులో బీసీ మహిళల కోటా స్పష్టంగా తెలుపాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్‌ చేశారు. ఈ కార్యక్రమంలో యువజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కనకాల శ్యామ్‌, విద్యార్థి సంఘం జాతీయ అధ్యక్షుడు తాటికొండ విక్రమ్‌ గౌడ్‌, రాష్ట్ర ఉపాధ్యక్షుడు కోడూరి పర్శరాం గౌడ్‌, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి గాజె రమేశ్‌, జిల్లా అధ్యక్షులు నాగుల కనకయ్య గౌడ్‌, జిల్లా వర్కింగ్‌ ప్రెసిడెంట్‌ రాచమల్ల రాజు, జిల్లా ప్రధాన కార్యదర్శి దొగ్గలి శ్రీధర్‌, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి గాజె రమేష్‌, రాష్ట్ర కార్యదర్శి జీఎస్‌.ఆనంద్‌, విద్యార్థి సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు నారోజు రాకేశ్‌, సంక్షేమ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు మంతెన కిరణ్‌, కాయితోజు బ్రహ్మచారి, జిల్లా కార్యదర్శి రాంమూర్తి గౌడ్‌, యువజన సంఘం జిల్లా అధ్యక్షుడు జీపీ.స్వామి, పట్టణ అధ్యక్షుడు కాస రాజు, బోయిని ప్రశాంత్‌, కలర్‌ సత్తన్న, గూడూరి భాస్కర్‌ పాల్గొన్నారు.

గంజాయి పట్టివేత

కరీంనగర్‌క్రైం: కరీంనగర్‌లోని అంబేద్కర్‌ స్టేడియం వేద్ద అనుమానాస్పదంగా తిరుగుతున్న ఇద్దరి వద్ద వన్‌టౌన్‌ పోలీసులు గంజాయి పట్టుకున్నారు. సీఐ రవికుమార్‌ వివరాల ప్రకారం బిహార్‌ నుంచి వచ్చి కోతిరాంపూర్‌లో ఉంటున్న ముఖేష్‌కుమా ర్‌ మెహతా(27), మానకొండూర్‌ మండలానికి చెందిన ఎరవేణి విజయ్‌(20) అంబేద్కర్‌ స్టేడియం వద్ద గంజాయితో తిరుగుతుండగా పోలీసులు వారిని సోదాచేశారు. రూ.3వేల విలువ గల గంజాయి లభించింది. గంజాయిని సీజ్‌ చేసి వారిపై కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

బతుకమ్మ వేడుకలో ముస్లిం యువతి



బతుకమ్మతో సుల్తానా బేగం



లక్ష్మీదేవిపల్లిలో దుర్గామాత మండపంలో నిలువెత్తు బతుకమ్మ

గంగాధర: తీరొక్క పూలతో బతుకమ్మను తయారు చేసి వేడుకల్లో పాల్గొన్న ముస్లిం యువతి సుల్తానా బేగం మత సామరస్యానికి ప్రతీకగా నిలిచింది. మండలంలోని బూర్గుపల్లికి చెందిన సుల్తానాబేగం ఆదివారం బతుకమ్మను పేర్చి గ్రామస్తులతో కలిసి సంబురంగా వేడుకల్లో పాల్గొంది. సుల్తానా బేగంను ఎమ్మెల్యే రవిశంకర్‌, సర్పంచ్‌ రమ్య, ఎంపీటీసీ లక్ష్మి అభినందించారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

జమ్మికుంట: రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు మృతిచెందాడు. ఎస్సై శ్రీధర్‌ తెలిపిన వివరాల ప్రకారం.. ఇల్లందకుంట మండలకేంద్రానికి చెందిన పెద్ది సురేశ్‌ (27) పట్టణంలోని ఓ మిల్లులో హమాలీ పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. శనివారం అర్ధరాత్రి పని ముగించుకొని బైక్‌పై వెళ్తుండగా హెచ్‌పీ పెట్రోల్‌ పంపు వద్ద కొత్తపల్లికి చెందిన వంశీ సురేశ్‌ ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో సురేశ్‌ తలకు తీవ్రగాయాలు కాగా చికిత్స నిమిత్తం హనుమకొండలోని ఓ ప్రై వేటు ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు. మృతుడికి భార్య మమత, కూ తు రు ఉంది. మమత ఫి ర్యాదు మేరకు కేసు న మోదు చేసి దర్యాప్తు చే స్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

కాలువలో పడి యువకుడు మృతి



నరేందర్‌రెడ్డి మృతదేహం

హుజూరాబాద్‌రూరల్‌: పండుగకు బంధువుల ఇంటికి వచ్చిన ఓ యువకుడు ప్రమాదవశాత్తు కాలువలో పడిమృతి చెందాడు. ఈ ఘటన మండలంలోని చిన్నపాపయ్యపల్లి గ్రామంలో చోటు చేసుకుంది. గ్రామస్తుల వివరాల ప్రకారం.. హన్మకొండ జిల్లా శాయంపేట మండలం ఆరెపల్లి గ్రామానికి చెందిన వరాల నరేందర్‌రెడ్డి(23) దసరా పండగకు చిన్నపాపయ్యపల్లిలోని బంధువుల ఇంటికి వచ్చాడు. తోటి స్నేహితులతో కలిసి సమీపంలోని కాకతీయకాలువలో స్నానం చేసేందుకు వెళ్లాడు. కాలువలోకి దిగగా ప్రమాదవశాత్తు నీళ్లలో పడిపోయాడు. ఈత రాకపోవడంతో మునిగిపోతుండగా.. స్నేహితులు గమనించి ఒడ్డుకు చేర్చారు. వెంటనే ఏరియా ఆసుపత్రికి తరలించారు. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. సంఘటన స్థలాన్ని ఎస్సై సందర్శించి వివరాలు సేకరించారు. మృతుడి బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

చికిత్స పొందుతూ ఒకరు..



చంద్రశేఖర్‌ (ఫైల్‌)

కరీంనగర్‌ క్రైం: ఆర్థిక ఇబ్బందులతో ఆత్మహత్యకు యత్నించిన యువకుడు చికిత్స పొందుతూ చనిపోయాడు. వన్‌టౌన్‌ సీఐ రవికుమార్‌ వివరాల ప్రకారం .. గన్నేరువరం మండలానికి చెందిన లోకోజీ రాజా చంద్రశేఖర్‌ (28) కరీంనగర్‌లోని అశోక్‌నగర్‌లో అద్దె ఇంట్లో ఉంటూ బంగారు ఆభరణాల తయారీ పని చేసుకుంటూ జీవిస్తున్నాడు. కొంతకాలంగా వ్యాపారంలో నష్టాలు రావడంతో ఆర్థిక ఇబ్బందులతో మద్యానికి బానిసయ్యాడు. తీవ్ర మానసిక వేదనకు గురై ఈనెల 17వ తేదీన తన గదిలో పురుగుల మందు తాగి కుటుంబ సభ్యులకు ఫోన్‌ చేసి విషయం తెలిపాడు. వారు వెంటనే కరీంనగర్‌కు చేరుకొని అతన్ని చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు. కుటుంబసభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ వివరించారు.

గుంతలో పడిన బైక్‌.. పసికందు మృతి



బాలుడి మృతదేహం

సైదాపూర్‌(హుస్నాబాద్‌): కొద్దిసేపట్లో సద్దుల బతుకమ్మ... పండక్కి బట్టలు తీసుకొద్దామని దంపతులు ఆరునెలల కొడుకును తీసుకుని బైక్‌పై సైదాపూర్‌ నుంచి హుజూరాబాద్‌కు వెళ్తున్నారు. మార్గంమధ్యలో బైక్‌ అదుపుతప్పి కందకంలో పడింది. తల్లిదండ్రులకు గాయాలు కాగా.. బాలుడు మృతిచెందాడు. పోలీసుల వివరాల ప్రకారం.. సైదాపూర్‌కు చెందిన గాదపాక ప్రశాంత్‌- బిందు దంపతులు వారి ఆరునెలల కొడుకుతో ఆదివారం బైక్‌పై హుజూరాబాద్‌కు పండగ బట్టలు తీసుకోవడానికి వెళ్తున్నారు. రాంచంద్రాపూర్‌ సమీపంలో రోడ్డు మూలమలుపు వద్ద బైక్‌ అదుపు తప్పింది. పక్కనే ఉన్న కందకంలో బైక్‌ పడింది. బిందు, ప్రశాంత్‌లకు తీవ్ర గాయాలయ్యాయి. బాలుడి తలకు తీవ్రగాయాలు కావడంతో స్థానికులు 108లో హుజూరాబాద్‌ ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు బాలుడు అప్పటికే మృతి చెందినట్లు తెలిపారు. బిందు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై ఆరోగ్యం వివరించారు.

విజయ దశమి ప్రత్యేకం

స్త్రీ శక్తి విజయం విజయ దశమి



ఈ చరాచర జగత్తుని నడిపించేది శక్తి. ఈ శక్తి లేనట్టయితే బ్రహ్మా విష్ణు మహేశ్వరులు తమ తమ కృత్యాలైన సృష్టి స్థితిలయాలు నిర్వర్తించటమే కాదు, కదలటం కూడా చేత కాని వారవుతారు. ఆ శక్తినే అదిశక్తి, పరాశక్తి అంటారు. ఆ శక్తి త్రిగుణాత్మకంగా ఉంటుంది. సత్వరజస్తమో గుణాలతో శక్తిబీజం సంయోగం చెందితే 'స్త్రీ'అవ్వుతుంది. అటువంటి త్రిగుణాలతో కూడిన శక్తి ఆవిర్భవించి దుష్టరాక్షస సంహారం చేసిన సమయం శరదృతువు.

ఇవే కాదు మహాశక్తి ఎప్పుడు ఎక్కడ దుష్టసంహారం చేయవలసిన అవసరం వచ్చినా, శిష్టరక్షణ చేయవలసిన అవసరం కలిగినా జీవులపై ఉన్న అంతులేని ప్రేమతో అవతరిస్తూ వచ్చింది. ఎంతైనా జగన్మాత కదా! అన్ని సందర్భాలలోను ఆ తల్లి ఆశ్వయుజ శుద్ధ పాడ్యమి నాడు అవతరించి నవమి నాడు రాక్షససంహారం చేయటం జరిగింది. కనుక ఆదిపరాశక్తిని ఆ సమయంలో పూజించి ఆ తల్లి అనుగ్రహం పొందటం సంప్రదాయం అయింది.

అందరు దేవతల శక్తి ఏకీకృతమై రూపుదాల్చిన శ్రీదేవి రాక్షసులతో యుద్ధంచేసే సమయంలో దేవతలు, ఋషులు ఆమెకు పుష్టి కలగటానికి – యజ్ఞాలు, హోమాలు, జపాలు, తపాలు, పూజలు, పారాయణలు మొదలైన దీక్షలు పూనారు. మానవులు కూడా ఉడతాభక్తిగా తమకు తోచిన విధంగా దీక్షలు చేయటం మొదలు పెట్టారు.

ప్రథమంగా ఆవిష్కృతమైన శక్తి తమోగుణ ప్రధానమైనది. నిర్గుణయైన పరాశక్తి మొదటి సగుణ ఆవిర్భావం తమోగుణమయమైన మహాకాళి. అందువల్లనే మహాకాళీ మహాలక్ష్మీ మహాసరస్వతీ అని జగదంబిక త్రిశక్తులలో మొదటిదిగా మహాకాళినే పేర్కొనటం జరుగుతుంది.

ఇది వైవస్వత మన్వంతర వృత్తాంతం.

సావర్ణి మన్వంతరంలో ఆదిపరాశక్తి రజోగుణ ప్రధానమైన మహాలక్ష్మిగా అవతరించింది. దానికి హేతువు మహిషాసురుడు.ఈ తత్త్వాన్ని వంట పట్టించుకోవటం ఏ కాలం లోనైనా అవసరమే. మహిషాసురులు ఎప్పుడూ ఉంటారు. అందుకే మహిషాసుర మర్దినులైన మహాలక్ష్ముల అవసరం ఎప్పుడూ ఉంటుంది.

మహిషుని సంహరించేందుకు త్రిమూర్తుల నుంచి ఉద్భవించిన తేజస్సు అమ్మవారిగా ఆకారం ధరించింది. దేవతలందరూ ఆమెకు తమ తేజస్సును, ఆయుధాలను సమకూర్చారు. తన సంహారం కోసమే ఆమె ఆవిర్భవించిందని తెలిసినా మహిషుడు రకరకాలుగా ఆమెను ప్రలోభ పెట్టాలని చూశాడు. ఆమె అంగీకరించకపోయేసరికి కామరూపి గనుక ఆమెతో రకరకాల రూపాలతో యుద్ధం చేశాడు. ఆ రూపాలకు తగిన రూపాలను ధరించి దేవి మహిషరూపంలో ఉన్న రాక్షసుని సంహరించింది. ఇది జరిగింది ఆశ్వయుజ శుద్ధ నవమి రోజున. అప్పటివరకు దీక్ష వహించిన వారందరు దశమి నాడు జగదంబను స్తుతించి, అమ్మకు పట్టాభిషేకం చేసి, స్త్రీ శక్తి విజయానికి వేడుకలు చేసుకుని ఆనందించారు. వారి స్తుతులకు సంతసించిన శ్రీదేవి వారిని వరం కోరుకోమన్నది. తమకు అవసరమైనప్పుడు ఈ విధంగా కాపాడమని కోరారు. ఆమె వారు తలచినప్పుడు అవతరిస్తానని మాట ఇచ్చింది.



నవరాత్రులు అన్నా, అమ్మవారి పూజలన్నా ప్రధానంగా చేసేది లలితా రహస్య నామ సాహస్ర పారాయణం. కుంకుమార్చన చేసినా సహస్రనామాలతోనే చేస్తారు. జగదంబ లలితాదేవిగా ఆవిర్భవించిన ఇతివృత్తం బ్రహ్మాండ పురాణం లలితో పాఖ్యానంలో వివరించబడింది. ఆమె సర్వచైతన్యస్వరూపిణి కనుక ఆమెను 'లలిత' అని పిలిచారు.తమను కన్నతల్లి లాగా భావించి శ్రీమాతా! అని సంబోధించారు. జీవితం అంటే సుఖపడటం – సుఖపడటం అంటే తినటం, నిద్రపోవటం మాత్రమే అని భావించటమే బండతనం. అటువంటి వారికి ఉండేది శూన్యమే కదా! బండతనం పోవాలంటే తగిన మార్గం ఒకటే. అది చైతన్యవంతులు కావటమే. అందుకే జగదంబ భండాసురవధ చేయటానికి సర్వచైతన్యస్వరూపిణిగా అవతరించింది. బండతనం మీద చైతన్యం విజయం సాధించటానికి సంకేతం విజయదశమి. శరన్నవరాత్రులలో అమ్మ అవతారాలలో లలితాదేవి అవతారం ఎంతో ప్రాధాన్యాన్ని కలిగి ఉంటుంది. నిజానికి శక్తి అన్నా, చైతన్యమన్నా ఒకటిగానే భాసిస్తాయి. చైతన్యం లేనిదే శక్తి వ్యక్తం అయ్యే అవకాశం లేదు కదా!

మరొకప్పుడు శుంభ నిశుంభులనే దానవ సోదరులు వేల ఏండ్లు తపస్సు చేశారు. బ్రహ్మ వారి తపసుకి మెచ్చి, ప్రత్యక్షమై వరం కోరుకోమంటే – తమకు అమరత్వం ప్రసాదించమని కోరారు. బ్రహ్మ అది తన చేతులలో లేదని, ఇంకేదైన వరం కోరుకోమని అన్నాడు. వారు తమకు అమర, నర, పశు, పక్షి పురుషుల వల్ల చావులేని వరం ఇమ్మని కోరారు. అంతటితో ఆగలేదు. స్త్రీలు బలహీనులు కనుక మాకు వారి వల్ల భయం లేదు అని చెప్పారు. బ్రహ్మ తథాస్తు అన్నాడు. స్వర్గంపై దాడి చేసి, ఇంద్రుని ఆసనాన్ని అధిరోహించి, త్రైలోక్యాధిపత్యాన్ని, యాగభాగాలని కూడా హరించారు. దిక్పాలకులను సూర్యచంద్రాది దేవతలను గెలిచి, వారి పదవులను కూడా గ్రహించాడు. వారి పనులు కూడా తానే చేయటం మొదలు పెట్టాడు.

దేవతలు బృహస్పతి సూచనననుసరించి హిమవత్పర్వతం మీద ఉన్న దేవిని శరణు వేడారు. జగదంబ వారికి అభయం ఇచ్చింది. ఆ సమయంలో సర్వదేవతలు తమ తమ శక్తులను జగదంబకు తోడుగా పంపారు. అవన్నీ ఆయా దేవతలకు చెందిన ఆభరణాలను, ఆయుధాలను ధరించి, వాహనాలను అధిరోహించి వచ్చి రక్తబీజుని సైన్యాన్ని మట్టు పెట్టసాగాయి. ఈ శక్తులను మాతృకాగణాలు అంటారు.

1. బ్రహ్మ శక్తి బ్రహ్మణి.
2. విష్ణువు శక్తి వైష్ణవి
4. కుమారస్వామి శక్తి షష్ఠీ దేవి కౌమారి.
5. ఇంద్రుని శక్తి ఐంద్రి, మాహేంద్రి, ఇంద్రాణి అనే పేర్లు కూడా ఆమెకున్నాయి.
6. ఆదివరాహమూర్తి శక్తి వారాహీ దేవి
7. నృసింహుని శక్తి నరసింహ రూపం నారసింహీ అనే నామం.

ఈ మాతృకా గణంతో పాటుగా వరుణుని శక్తి వారుణీదేవి శత్రువులని పాశంతో బంధించి, మూర్ఛితులను చేసి, ప్రాణాలను తీస్తోంది.

యముని రూపంతో యముని శక్తి యామ్యాదేవి మహిషము నెక్కి, దండాన్ని ధరించి, భయం గొలిపే విధంగా రణభూమిలో అడుగు పెట్టి, దానవులని యమసదనానికి పంపుతోంది. వీరికి తోడు శివదూతి కూడ విజృంభించి దానవులను నేలకూల నేస్తూ ఉంటే, చాముండా, కాళికలు వారిని తినేస్తున్నారు.

దానవులు భయపడి పారిపోతుంటే రక్తబీజుని కోపం మిన్ను ముట్టి, దేవితో యుద్ధానికి వచ్చాడు. మాతృకాగణాలు అతడిపై ఆయుధాలను వేయగానే వాడి శరీరం నుండి కారిన ప్రతి రక్తబిందువు నుండి, ఒక్కొక్క రక్తబీజుడు పుట్టి వారి సంఖ్య అసంఖ్యాకం అయింది. దేవతలందరు భయభ్రాంతులై పోయారు. అప్పుడు అంబిక కాళికను నోరు పెద్దది చేసి, రక్తబీజుడి నుండి కారుతున్న రక్తాన్నంతా తాగి వేయ మని చెప్పింది. వాడి శరీరం నుండి కారుతున్న రక్తాన్ని, కింద పడకుండా తాగటంతో వాడు నీరసించాడు. వాడి శరీరాన్ని శ్రీదేవి ముక్కలు చేస్తుంటే, కాళిక తినేసింది. అంబిక వాహనమైన సింహం కూడా ఎంతో మంది దానవులని తినేసింది.

అపుడు నిశుంభుడు శ్రీదేవితో యుద్ధానికి బయల్దేరాడు. ముందుగా నిశుంభుడి తల తెగ నరికింది దేవి. అయినా అతడి మొండెం కత్తి పట్టుకొని తిరుగుతుంటే ఆ మొండెం కాళ్ళు చేతులు నరికింది దేవి. దానితో నిశుంభుడు అసువులు బాసాడు.

శుంభుణ్ణి శ్రీదేవి తనతో యుద్ధం చేయలేకపోతే చండికతో గాని, కాళికతో గాని యుద్ధం చెయ్యమంది. అతడు పౌరుషం పెరిగి, శ్రీదేవితోనే యుద్ధం చేయదలచాడు. ఘోరయుద్ధం తరువాత శ్రీదేవి శుంభుని పరిమార్చింది. దేవతలకు తిరిగి స్వర్గ రాజ్యం లభించింది. మాటలతో సాధించిన విజయానికి సంకేతం ఇది. మాట నైపుణ్యంతో యుద్ధానికి ఆహ్వానించి గెలిచిన జగన్మాత అవతారాన్ని మహా సరస్వతిగా చెప్పటం జరిగింది.



సమాజంలో ఎప్పుడూ మంచి చెడూ కలిసే ఉంటాయి. వాటి మధ్య జరిగే సంఘర్షణలో మంచి గెలవటానికి ప్రతీక విజయ దశమి. అలా మంచి గెలవటానికి ఎప్పుడు ఏ శక్తి కావాలో ఆ శక్తిగా అవతరించి సజ్జనులకు తోడుపడుతుంది జగన్మాత. అది శరీరంలో అనారోగ్యం కావచ్చు, మనస్సులో ఉన్న దుర్గుణాలు, దురాలోచనలు కావచ్చు, సమాజంలో ఉన్న దురాచారాలు, మూఢనమ్మకాలు కావచ్చు, ప్రకృతిని, పర్యావరణాన్ని కలుషితం చేసే మాలిన్యాలు కావచ్చును. సృష్టి నియమాలకి విరుద్ధంగా కలకాలం బతికి ఉండాలనే స్వార్థం కావచ్చును. ఒక జాతినో, వర్గాన్నో చులకన చేసే అహంకారం కావచ్చు ఒక జాతినో, వర్గాన్నో అవమానం చెయ్యటం కావచ్చును – ఇటువంటి ఎన్నో చెడులక్షణాల మీద విజయం సాధించిన రోజు విజయ దశమి. ముఖ్యంగా స్త్రీ పట్ల చులకన భావం కలిగిన దున్నపోతు మనస్తత్వం మీద స్త్రీ శక్తి విజయానికి సంకేతం విజయ దశమి. సద్భావనలు పెంపొందించుకునే రోజు. అందుకే ఒకరినొకరు అభినందించుకుంటూ జమ్మి పత్రాలని బంగారం, వెండి అనే పేరుతో పంచుకుంటూ ఉంటారు.

సామూహికంగా కుంకుమార్చనలు చేసినా, చండీహోమాదులు చేసినా, బొమ్మల కొలువులు పెట్టినా, బతకమ్మలు ఆడినా కనపడేది ఏదైనా పది మంది కలిసి చేయాలనే ఐక్యభావన. శక్తి స్వరూపమైన స్త్రీ జాతి పట్ల గౌరవ మర్యాదలు నెరపటం.

''యా దేవీ సర్వ భూతేషు శక్తి రూపేణ సంస్థితా
నమస్తస్యై నమస్తస్యై నమస్తస్యై నమో నమః.''

– డాక్టర్ ఎస్.అనంతలక్ష్మి

సినిమా

టైగర్ నాగేశ్వరరావు సంతృప్తి ఇచ్చింది – రవితేజ



● అభిషేక్ అగర్వాల్, వంశీకృష్ణ, రవితేజ, వివేక్ కూచిభొట్ల, మయాంక్ సింఘానియా

''టైగర్ నాగేశ్వరరావు' చిత్రాన్ని ప్రేక్షకులు, నా శ్రేయోభిలాషులు, నా అభిమానులు గొప్పగా ప్రశంసిస్తున్నారు. వాళ్లే ఈ సినిమాని బ్రహ్మాండంగా ప్రమోట్ చేయడం ఆనందంగా ఉంది. 'విక్రమార్కుడు' చిత్రంలోని విక్రమ్ రాథోడ్ తర్వాత నాకు మళ్లీ అంతటి సంతృప్తిని ఇచ్చిన పాత్ర 'టైగర్ నాగేశ్వరరావు'. ఈ చిత్రాన్ని ఇంత గొప్పగా ఆదరిస్తున్న ప్రేక్షకులకు ధన్యవాదాలు'' అని హీరో రవితేజ అన్నారు. వంశీ కృష్ణ దర్శకత్వంలో రవితేజ హీరోగా, నూపుర్ సనన్, గాయత్రీ భరద్వాజ్ హీరోయిన్లుగా నటించిన చిత్రం 'టైగర్ నాగేశ్వరరావు'. తేజ్ నారాయణ్ అగర్వాల్ సమర్పణలో అభిషేక్ అగర్వాల్ నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 20న(శుక్రవారం) విడుదల అయింది. ఆదివారం హైదరాబాద్‌లో నిర్వహించిన ఈ సినిమా సక్సెస్ మీట్‌లో రవితేజ మాట్లాడుతూ– ''అభిషేక్ అగర్వాల్ ఎక్కడా రాజీ పడకుండా ఈ సినిమాని తీశారు. ఆయన భవిష్యత్‌లో భారీ సినిమాలు తీసి, హిట్లు కొట్టాలి. వంశీలో మంచి ప్రతిభ ఉంది. తనతో మళ్లీ సినిమా చేయాలని ఉంది'' అన్నారు. ''నాకు ఇది పెద్ద సినిమా. రవితేజ, అభిషేక్‌గార్ల వల్లే ఇది సాధ్యపడింది. వీడు మావాడు అని చెప్పుకునేలా సినిమాలు తీస్తూనే ఉంటాను'' అన్నారు వంశీకృష్ణ. ''మా సినిమాకి ప్రేక్షకుల స్పందన, షోలు, వసూళ్లు రోజురోజుకి పెరుగుతున్నాయి'' అన్నారు అభిషేక్ అగర్వాల్. ఈ కార్యక్రమంలో నిర్మాతలు వివేక్ కూచిభొట్ల, మయాంక్ సింఘానియా తదితరులు పాల్గొన్నారు.

ఆ కిక్కే వేరు రా!

''నేను దాన్ని ఎంత ప్రేమిస్తున్నానంటే, దానికి ఫ్రెండ్స్, ఫ్యామిలీ ఎవరూ అక్కర్లేదు రా..! నేను చాలు..! ట్వంటీఫోర్ హవర్స్ పిల్ల నాతోనే ఉండాలనిపిస్తది.. నాది అని చెప్పుకోవడానికి ఓ గర్ల్ ఫ్రెండ్ ఉంటే.. ప్చ్.. ఆ కిక్కే వేరు రా..!'' అనే డైలాగ్స్‌తో కూడిన వాయిస్ ఓవర్‌తో మొదలవుతుంది 'ది గర్ల్ ఫ్రెండ్' సినిమా మోషన్ పోస్టర్. హీరోయిన్ రష్మికా మందన్నా ప్రధాన పాత్రలో నటిస్తున్న చిత్రం ఇది. రాహుల్ రవీంద్రన్ దర్శకత్వం వహించనున్నారు. అల్లు అరవింద్ సమర్పణలో గీతా ఆర్ట్స్, మాస్ మూవీ మేకర్స్, ధీరజ్ మొగిలినేని ఎంటర్ టైన్‌మెంట్ పతాకాలపై విద్య కొప్పినేని, ధీరజ్ మొగిలినేని నిర్మించనున్న 'ది గర్ల్ ఫ్రెండ్' సినిమాను ఆదివారం అధికారికంగా ప్రకటించారు. ''ఈ ప్రపంచం ప్రేమకథలతో నిండిపోయి ఉంది. కానీ ఈ ప్రేమ కథల్లో ఇప్పటివరకు ఎవరూ వినని, చూడనవి కూడా ఉన్నాయి. 'ది గర్ల్ ఫ్రెండ్' చిత్రం అలాంటిదే'' అని ట్వీట్ చేశారు రష్మికా మందన్నా. ''ఈ సినిమా ప్రేక్షకులకు ఓ సరికొత్త అనుభూతిని ఇస్తుంది. త్వరలోనే చిత్రీకరణ ప్రారంభిస్తాం'' అని చిత్రయూనిట్ పేర్కొంది. ఈ చిత్రానికి సంగీతం: హేషమ్ అబ్దుల్ వాహబ్, కెమెరా: కృష్ణన్ వసంత్.



● 'ది గర్ల్ ఫ్రెండ్' లో రష్మిక

అప్పుడే అది జరుగుతుంది

– అల్లు అర్జున్




● దేవిశ్రీ ప్రసాద్, అల్లు అర్జున్

''పుష్ప' చిత్రానికి నేను, దేవిశ్రీ ప్రసాద్ జాతీయ అవార్డులు అందుకోవడం సంతోషంగా ఉంది. ఏదైనా మనం మనసులో గట్టిగా అనుకుంటే జరుగుతుందని అంటుంటారు. అయితే మనం అనుకున్నా, కష్టపడినా అది యాభై శాతం మాత్రమే జరుగుతుంది. మిగతా యాభై శాతం మన చుట్టూ ఉన్న వాళ్లు కూడా కోరుకోవాలి.. అప్పుడే అది జరుగుతుంది'' అని హీరో అల్లు అర్జున్ అన్నారు. 'పుష్ప' చిత్రానికి జాతీయ ఉత్తమ నటుడిగా అల్లు అర్జున్, ఉత్తమ సంగీత దర్శకుడుగా దేవిశ్రీ ప్రసాద్ జాతీయ అవార్డులు సొంతం చేసుకున్న సంగతి తెలిసిందే. జాతీయ అవార్డుల్లో సత్తా చాటిన తెలుగు నటీనటులను, సాంకేతిక నిపుణులను మైత్రీ మూవీ మేకర్స్ సంస్థ ఆధ్వర్యంలో నిర్మాతలు నవీన్ ఎర్నేని, యలమంచిలి రవిశంకర్ ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా అల్లు అర్జున్ మాట్లాడుతూ– ''నాకు జాతీయ అవార్డు రావాలని కోరుకునేవాణ్ణి. అయితే నా కంటే బలంగా కోరుకున్నారు దర్శకుడు సుకుమార్‌గారు. నేను అచీవ్‌మెంట్ అయితే సుకుమార్ అచీవర్'' అన్నారు. దేవిశ్రీ ప్రసాద్ మాట్లాడుతూ–''అల్లు అర్జున్, సుకుమార్‌గార్లతో పనిచేయడం ఎంతో ఆనందంగా ఉంటుంది. మైత్రీమూవీ మేకర్స్ అంటేనే రాజీపడని నిర్మాతలు'' అన్నారు. ఈ వేడుకలో నటుడు ప్రకాష్ రాజ్‌తో పాటు పలువురు హీరోలు, దర్శకులు, నిర్మాతలు, నటీనటులు పాల్గొన్నారు.

కృష్ణారామా మా ఇంట్లో పుట్టిన కథే


– దర్శకుడు రాజ్ మదిరాజు



''ప్రస్తుతం చాలా మంది తమ తల్లిదండ్రులకు దూరంగా జీవిస్తున్నారు. దీంతో ఒంటరి తనంగా భావించిన తల్లిదండ్రులు తమ మనసులోని భావాలను సోషల్ మీడియా వేదికగా షేర్ చేసుకుంటున్నారు. మా తల్లి దండ్రులు కూడా ఒంటరితనాన్ని దూరం చేసుకోవడానికి ఫేస్ బుక్‌లోకి వచ్చారు. ఒక విధంగా '#కృష్ణారామా' కథ మా ఇంట్లో పుట్టిందే'' అని దర్శకుడు రాజ్ మదిరాజు అన్నారు. రాజేంద్ర ప్రసాద్, గౌతమి ప్రధాన పాత్రల్లో అనన్య శర్మ కీలక పాత్రలు పోషించిన చిత్రం ''#కృష్ణారామా'. అద్వితీయ మూవీస్‌పై వెంకట కిరణ్, కుమార్ కళ్లకూరి, హేమ మాధురి నిర్మించిన ఈ సినిమా ఆదివారం నుంచి ఓ ఓటీటీలో స్ట్రీమింగ్ అవుతోంది. ఈ సందర్భంగా దర్శకుడు రాజ్ మదిరాజు మాట్లాడుతూ– ''మన తల్లిదండ్రులు రిటైర్ అయిపోతే వాళ్ల జీవితమే అయిపోయిందనే భావనలోకి వెళ్లిపోతున్నాం. కానీ, వారి అనుభవం సమాజానికి ఎంతో అవసరం అని మా సినిమా ద్వారా చెబుతున్నాం. ఒక డైరెక్టర్‌గా నా పనిని నేను ఇష్ట పడతాను. నటుడిగా నా పరిధిలోనే ఉంటాను.. డైరెక్టర్స్‌కి సలహాలు, సూచనలు ఇవ్వను. ప్రస్తుతం డైరెక్టర్ గౌతమ్ తిన్ననూరి సినిమాలో ఓ మంచి పాత్ర చేశాను. డైరెక్టర్‌గా రెండు మూడు కథలు సిద్ధంగా ఉన్నాయి'' అన్నారు.

ఓ సవాల్‌గా తీసుకున్నా

– తల్లాడ వెంకన్న



● వెంకన్న

తల్లాడ వెంకన్న హీరోగా నటించిన చిత్రం 'ఒక్కడే నెం.1'. సునీత, శృతిక, మధువని హీరోయిన్లుగా నటించారు. శ్రీపాద రామచంద్రరావు దర్శకత్వంలో క్లాసిక్ సినీ క్రియేషన్స్‌పై నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 27న విడుదల కానుంది. ఈ సందర్భంగా జరిగిన ప్రీ రిలీజ్ వేడుకలో తల్లాడ వెంకన్న మాట్లాడుతూ–''వ్యాపారవేత్తగా సక్సెస్ అయిన నేను, సినిమా రంగాన్ని కూడా ఓ సవాల్‌గా తీసుకున్నాను. మంచి కథ, కథనంతో 'ఒక్కడే నెం.1' తీశాం. సురేశ్ బాబు, ఏషియన్ ఫిలింస్ వారు తెలుగు రాష్ట్రాల్లో మా సినిమాను రిలీజ్ చేసేందుకు ఒప్పుకోవడంతో సినిమా విజయంపై మా నమ్మకం మరింత పెరిగింది. కర్ణాటకలో కూడా డైరెక్ట్ రిలీజ్ చేస్తున్నాం'' అన్నారు. ''నేను గతంలో భక్తిరస చిత్రాలు తీశాను. వెంకన్నగారి ప్రోత్సాహం వల్లే 'ఒక్కడే నెం.1' లాంటి మంచి కమర్షియల్ సినిమాకు దర్శకత్వం వహించే అవకాశం లభించింది'' అన్నారు దర్శకుడు శ్రీపాద రామచంద్రరావు. నిర్మాతలు సి.కల్యాణ్, దామోదర ప్రసాద్, అంబికా కృష్ణ, తుమ్మలపల్లి రామ సత్యనారాయణ, దర్శకుల సంఘం అధ్యక్షుడు కాశీ విశ్వనాథ్, డైరెక్టర్ రేలంగి నరసింహారావు అతిథులుగా పాల్గొని, ఈ సినిమా విజయం సాధించాలని ఆకాంక్షించారు.

భలే చాన్స్



● శ్రీనిధి

'కేజీఎఫ్' ఫేమ్ శ్రీనిధి శెట్టి మంచి జోరుమీద ఉన్నారు. ఇటీవల తెలుగులో సిద్ధు జొన్నలగడ్డ హీరోగా నటిస్తున్న 'తెలుసు కదా' సినిమాలో ఓ హీరోయిన్‌గా నటించేందుకు శ్రీనిధి గ్రీన్ సిగ్నల్ ఇచ్చిన సంగతి తెలిసిందే. తాజాగా ఈ బ్యూటీ భలే చాన్స్ అందుకున్నారు. కన్నడ స్టార్ హీరో కిచ్చా సుదీప్ సరసన నటించనున్నారు శ్రీనిధి శెట్టి. హీరో సుదీప్, దర్శకుడు చేరన్ కాంబినేషన్‌లో సత్యజ్యోతి ఫిలింస్ ఓ సినిమాను నిర్మించనున్న సంగతి తెలిసిందే. ఈ సినిమాలో హీరోయిన్‌గా నటించనున్నారు శ్రీనిధి. త్వరలోనే ఈ సినిమా సెట్స్‌లో జాయిన్ కానున్నారట ఈ బ్యూటీ.

తండ్రీకొడుకుల నేపథ్యంలో...



● ధన్‌రాజ్

నటుడు ధన్‌రాజ్ దర్శకుడిగా మారారు. ఈ కొత్త చిత్రంలో తండ్రి పాత్రలో సముద్రఖని, కొడుకు పాత్రలో ధన్‌రాజ్ నటించనున్నారు. ప్రభాకర్ ఆరిపాక సమర్పణలో స్లేట్ పెన్సిల్ స్టోరీస్ బ్యానర్‌పై పొలవరపు పృథ్వి తెలుగు, తమిళ భాషల్లో ఈ సినిమాను నిర్మిస్తున్నారు. ఈ చిత్రం ప్రారంభోత్సవం ఆదివారం హైదరాబాద్‌లో జరిగింది. ముహూర్తపు సన్నివేశానికి దర్శకుడు సుబ్బు కెమెరా స్విచ్చాన్ చేయగా, నటుడు శివబాలాజీ క్లాప్ ఇచ్చారు. తొలి సన్నివేశానికి 'బలగం' దర్శకుడు వేణు గౌరవ దర్శకత్వం వహించగా, తెలుగు స్క్రిప్ట్‌ను దర్శకుడు రాజేంద్ర, తమిళ స్క్రిప్ట్‌ను దర్శకుడు భరత్‌కమ్మ యూనిట్ సభ్యులకు అందించారు. 'విమానం' చిత్ర దర్శకుడు శివ ప్రసాద్ యానాల ఈ మూవీకి కథ–మాటలు అందిస్తున్నారు. ''తండ్రీ కొడుకుల భావోద్వేగాల నేపథ్యంలో ఈ చిత్రం రూపొందనుంది. నవంబరు 9 నుంచి రెగ్యులర్ షూటింగ్‌ను ప్రారంభించనున్నాం'' అని చిత్రయూనిట్ పేర్కొంది. ఈ చిత్రం ప్రారంభోత్సవంలో నటులు సుడిగాలి సుధీర్, చమ్మక్ చంద్ర, తాగుబోతు రమేష్, మధునందన్, భూపాల్, పృథ్వి, 'రాకెట్' రాఘవ తదితరులు పాల్గొన్నారు. ఈ సినిమాకు సంగీతం: అరుణ్ చిలువేరు, కెమెరా: దుర్గా ప్రసాద్.

అందరూ మెచ్చే చిత్రాలు చేస్తా – నిర్మాత సతీష్ కుమార్



''గతంలో నేను నిర్మించిన 'బట్టల రామస్వామి బయోపిక్', 'కాఫీ విత్ ఏ కిల్లర్' సినిమాలు ప్రేక్షకాదరణ పొందాయి. ప్రస్తుతం గౌతమ్ కృష్ణ హీరోగా ఓ చిత్రం నిర్మిస్తున్నాను. యువత, కుటుంబ ప్రేక్షకులతో పాటు అందరూ మెచ్చే చిత్రాలు చేయడమే లక్ష్యంగా పెట్టుకున్నా'' అని నిర్మాత సెవెన్ హిల్స్ సతీష్ కుమార్ అన్నారు. గౌతమ్ కృష్ణ, శ్వేతా అవస్తి, రమ్య పసుపులేటి హీరో హీరోయిన్లుగా పి.నవీన్ కుమార్ దర్శకత్వంలో కొత్త సినిమా రూపొందుతోంది. సెవెన్ హిల్స్‌పై సతీష్ కుమార్ నిర్మిస్తున్నారు. నేడు (సోమవారం) తన పుట్టినరోజు సందర్భంగా సతీష్ కుమార్ ఆదివారం విలేకరులతో మాట్లాడుతూ–''ఒక సాధారణ మధ్యతరగతి వ్యక్తి స్టూడెంట్ నుంచి కార్పొరేట్ స్థాయికి ఎలా ఎదిగాడు? అనే నేపథ్యంలో రూపొందుతున్న చిత్రమిది. గౌతమ్ కృష్ణ ప్రస్తుతం బిగ్‌బాస్ తెలుగు సీజన్ 7 షోలో ఉన్నారు. ఆ షో నుంచి తిరిగి రాగానే మా సినిమా చివరి షెడ్యూల్ పూర్తి చేస్తాం'' అన్నారు. ఈ చిత్రానికి కెమెరా: త్రిలోక్ సిద్ధు, సంగీతం: జుడా శాండీ.